# ఈ పాపం ఎవరిది?

-సోమంచి రామం

**''అయ్యగారూ!... అయ్యగారూ!... బాలరాజు చచ్చిపోయాడండీ..' అంటూ పొద్దున్నే పరుగెత్తుకొచ్చాడు హైస్కూలు జవాను సుబ్బారావు.**

**'ఏమిటి సుబ్బారావ్ నువ్వనేది? - మన బాలరాజా! .. టెన్త్...' అంటూ దిగ్భ్రాంతితో ఆగిపోయారు హెడ్మాస్టారు జగన్నాదం గారు.**

'అవునయ్యా! నిన్న పరీక్షల్లో కాపీ పట్టుకున్నారు కదండీ.. అందుకని'

'అందుకని?'

'రాత్రి పురుగుల మందు తాగేసాట్టండీ! తెల్లారేటప్పటికి చచ్చి పడున్నాడు. ఆళ్ళంతా ఒకటే గోల'.

'అయితే నడు' అంటూ వున్న పళాన బయల్దేరిన జగన్నాథం గారి ముందు నడిచాడు సుబ్బారావు! ఊరి చివరగా వున్న గూడెం దగ్గరకెళ్ళేసరికి జగన్నాథం కాళ్ళు వణికాయి. గుండె దడ దడ లాడింది. బాలరాజు ఇంటి దగ్గర అప్పటికే చాలా మంది పోగైనారు. అంతా ఏడుపులు, శోకాలు! హృదయ విదారకంగా వుంది దృశ్యం.

'అయిపోయింది పంతులు గారూ!... అంతా అయిపోయింది!... చేతికందొస్తాడని అనుకున్నా!.. నా కొడుకు నన్నన్యాయం చేసేసి యెళ్ళిపోయాడండీ!' అంటూ ఆ తండ్రి, జగన్నాథం గారి దగ్గరకొచ్చి ఏడవసాగాడు! కాసేపు వాళ్ళని సముదాయించాక, సుబ్బారావు కేసి చూశారు జగన్నాథం గారు. ఆ చూపునర్థం చేసికొన్న సుబ్బారావు, బాలరాజు చొక్కా జేబు తడిమి చూశాడు. ఏం కనపడలేదు. నిక్కరు జేబులో చూశాడు. ఓ రూపాయి కాగితం, రెండు అర్థ రూపాయలు దొరికాయి. ఇంకా లోపలికి చెయ్యి పెట్టి చూస్తే - మడత పెట్టిన కాగితం ఒకటి దొరికింది. తీసి జగన్నాథం గారికిచ్చాడు. అది వాడి హాల్ టిక్కెట్టు ఫోటో స్టాట్ కాపీ! దాన్తో చిన్న కాగితం వుంది. దాన్ని చూడగానే ఆయన గుండె చెరువైపోయింది. అయినా పైకి ఏమీ కనబడనీయకుండా, వచ్చే దుఃఖాన్ని నిగ్రహించుకున్నారు. హాల్ టిక్కెట్టు ఫోటో స్టాట్‌నే అందరికీ చూపించారు. మడిచి జేబులో పెట్టుకున్నారు. ఓ అరగంట సేపుండి అందర్నీ ఓదార్చి తర్వాత కార్యక్రమం త్వరగా ముగించమని చెప్పి, తిరుగుముఖం పట్టారు ఇద్దరూ.

★★★

ఎనిమిది గంటలకు బడి మొదలవగానే అసెంబ్లీలో బాలరాజు గురించి చెప్పి, ఆ పసివానికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అటెండెన్స్ వేసి పిల్లల్ని ఇళ్ళకు పంపేశారు. మధ్యాహ్నాం మళ్ళీ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అటెండెన్స్ వేసి పిల్లల్ని ఇళ్ళకు పపంపేశారు. మధ్యాహ్నాం మళ్ళీ రెండు గంటలకు టెన్త్ వాళ్ళకి పరీక్ష. ఆ ఏర్పాట్లు చూసుకుంటున్నారు జగన్నాథం గారు. బాలరాజు హాలు టిక్కెట్టునీ, వాడి ఫోటోని పదే పదే చూడ్డంతో ఆయన హృదయం మరింత క్షోభించసాగింది. ఆ పసి వెధవ పెరిగి పెద్దవడానికి పదిహేనేళ్ళు పట్టింది. కాని వాడి ప్రాణాలు పోవడానికి పది హేను నిమిషాలు కూడా పట్టలేదు. వాడి చావుకి కారణం వాడే చెప్పుకున్నాడు. కాని... ఆ కారణానికి గల కారణాలు మాత్రం ఎవరూ చెప్పరు, చెప్పుకోరు.. అదంతే! పదిహేను గంటల క్రితం సజీవంగా పరీక్ష రాసిన ఆ చిన్ని వెధవ, ఈ పాటికి మట్టిలో కలిసిపోయే వుంటాడు పాపం! ఇలా తల్చుకుంటుంటే గత దినం జరిగిన ఘట్టం ఆయన కళ్ళ ముందుకొచ్చి నిల్చింది.

★★★

'సుబ్బారావ్! చీఫ్ సూపరింటెండెంటు గార్నోక సారిలా పిలు!' పరీక్ష రూంలో ఓ ఇన్విజిలేటరు గారి కేక!

'అయ్య గారూ! మూడో నెంబరు రూములో మేస్టారు పిలుస్తున్నారండీ!'

జగన్నాధం గారు ఆఫీసు రూంలోంచి ఆ రూముకెళ్ళారు.

'సార్! ఇదిగో.. ఈ కుర్రాడు - కాపీ - రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాను' అంటూ బాలరాజుని చూపించాడా ఇన్విజిలేటరు.

జగన్నాథం గారు అసలే స్ట్రిక్టు మనిషి. ఆయన స్కూల్లో కాపీలు చేసే ధైర్యం కాని, అలవాటు కానీ ఎవరికీ లేదు... కాని.. కాని.. కాని.. బాలరాజు కాపీ చేస్తున్నాడంటే-

'ఏరా? కాపీ చేశావా?' గర్జించారు జగన్నాథం గారు.

'చెయ్యలేదండీ!' బాలరాజు సమాధానం.

'మరి ఈ కాపీ ఏమిటి?'

'చేద్దామనే తెచ్చానండీ!'

'అంటే కాపీ చేయాలనే అనుకున్నావా?'

'అవునండి! ధీరమ్ రాలేదండీ! అందుకని...'

'కాపీ చేద్దామనే తీశాడు సార్! ఈలోగా నేను చూసి పట్టుకున్నాను!' అడ్డు తగిలాడు ఆ ఇన్విజిలేటరు.

జగన్నాథం గారు ఆ కాపీని చేత్తో తీసుకున్నారు. బాలరాజు తల వొంచుకుని నిలబడ్డాడు.

'ఇదిగోండి సార్! నా రిపోర్టు. ఏం చేస్తారో మీ ఇష్టం!' అంటూ ఓ కాగితం అందించాడాయనకు.

జగన్నాథం గారు తెల్లబోయారు. ఇంకా కాపీ చేయలేదు కదా? వార్నింగ్ ఇచ్చి భయపెడ్దామనుకున్నారు. కాని.. ఇన్విజిలేటర్ రిపోర్టు ఇచ్చాక యాక్షన్ తీసుకోకపోతే-

'కాపీ చేయ లేదు కదా ఇంకా..' అనబోయారాయన.

'అదంతా నాకనవసరం సార్! కాపీ చేసినా చేయకపోయినా, కాపీ దొరికింది. దట్సాల్. ఏం యాక్షన్ తీసుకుంటారో అది మీ ఇష్టం. నా రిపోర్టు ముట్టినట్టు దాని కాపీ మీద సంతకం పెట్టి ఇవ్వండి చాలు!.. నా డ్యూటీ నేను చేసినట్లవుతుంది' అన్నాడా ఘహానుభావుడు.

దానిక్కారణం లేకపోలేదు. ఆ ఇన్విజిలేటరు ఆ స్కూల్లోనే సైన్స్ టీచరుగా పని చేశాడు. ప్రవర్తన సరిగా లేని కారణంగా ఏడాది క్రితమే ట్రాన్స్‌ఫర్ చేశారు. దానికి కారణం జగన్నాథం గారేనని అతని నమ్మకం. అందుకే ఆయన మీద కోపం. పగ! ఆ పగ తీర్చుకునేందుకిదో మార్గం! బాలరాజుని పట్టివ్వడం ద్వారా ఆయన ఎంత స్ట్రిక్టుగా ఉంటాడో తేల్చాలి. అంటే వారిద్దరి వైనం మధ్య బాలరాజు భవిష్యత్తు ఆధారపడి ఉందన్నమాట! ఒక్క బాలరాజనే ఏమిటి? చాలా పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తు బలై పోవడానికి ముఖ్య కారణాల్లో ఇదొకటి. హెడ్మాస్టరుకి, స్టాఫుకి సత్సంబంధాలు లేకపోవడం, వాళ్ళ మధ్య ఏర్పడే పొట్లాటలు, గొడవలతో, విద్యాబోధనే తమ ప్రధాన లక్ష్యమనే ఇంగితజ్ఞానం కూడా మర్చిపోతున్నారు. ఉపాధ్యాయుల మీద ఎలాగైనా యాక్షన్ తీసికోవాలని హెడ్మాస్టరూ, హెడ్మాస్టర్ని ఎందులోనన్నా ఇరికించి అల్లరి పాలు చేయాలని టీచర్లూ, - ఇలా ఒకరి వెనుక ఒకరు గోతులు తవ్వుకుంటూ దాగుడు మూతలాట ఆడుకోవడమే తప్ప, తమ డ్యూటీ సంగతే పట్టించుకోవడం లేదు. ఆబోతుల మధ్య లేగదూడల్లా వీరి కక్షలకు, కార్పణ్యాలకు పిల్లలు బలైపోతున్నారు. సరిగ్గా ఇప్పుడే జరిగింది. అందుకే ఆ ఇన్విజిలేటరు పట్టుబడటంతో జగన్నాథం గారు చేసేదేం లేక బాలరాజు దగ్గర స్టేట్‌మెంట్ తీసుకుని పరీక్ష హాల్లోంచి పంపించేశారు.

★★★

'అయ్యా! పదయింది. మధ్యాహ్నాం పరీక్షల డ్యూటీ వున్న మేస్టర్లు వెడతామంటున్నారు' అంటూ పలకరించే దాకా జగన్నాథం గారి మనసు మనసులో లేదు. వికలమై పోయింది.

'సరే! వెళ్ళమను' అని చెప్పి మధ్యాహ్నాం పరీక్ష ఏర్పాట్లు చూడసాగారు. మూడో నెంబరుపై సున్న చుట్టారు. ఆ రూము హాల్ టికెట్లలోంచి బాలరాజు టికెట్ తీసేశారు. దుఃఖం ముంచుకొచ్చింది. అప్పుడు బాలరాజు రాసిన కాగిత్యాన్ని మళ్ళీ తీసి చదువుకున్నారు.

'స్కూల్లో ఎవర్నీ కాపీ చెయ్యనివ్వరు. ఏం చేయను? రెండేళ్ళ నుంచీ లెక్కల మాస్టారు లేరు. నాకు లెక్కల్లోనే డౌటు! అది ప్యాసైతే టెన్త్ అయిపోయినట్టే. అందరూ వూళ్ళో ప్రైవేటు మాస్టారి దగ్గర లెక్కలు చెప్పించుకుంటారు. డబ్బులేందే ఆయన నాకు చెప్పనన్నారు. ఇంకేం చేయను? అందుకే కాపీ చేద్దామనుకున్నాను. కాపీ పట్టుకుంది ఎవరో కాదు. మా సైన్స్ మాస్టారే. కాపీ పట్టాక పిల్లలందరూ నాకేసి అసహ్యంగా చూశారు. హెడ్మాస్టరు బయటికి పంపేశారు. రేపటి నుంచి పల్లిలంతా గేలి చేస్తారు. ఎలా బతకను? చచ్చిపోతే ఏ బాధా వుండదుగా!'

పట్టుమని పదిహేనేళ్ళయినా లేని ఆ పసివాడి మానసిక క్షోభకు ఆ చిన్న కాగితం అద్దం పడుతోంది. కాగితాన్ని మడిచి డ్రా సొరుగులో పెట్టి తాళం వేశారు. అయినా ఆ కాగితం ముక్క బైటికొచ్చి తనకేసే చూసి వికటాట్టహాసం

చేస్తున్నట్టనిపిస్తోంది.

★★★

'అయ్యగారూ! కొత్త లెక్కల మాస్టారంట! జాయినవ్వడానికి వచ్చారు' అంటూ సుబ్బారావు ఓ వ్యక్తిని లోపలకు తీసుకొచ్చాడు.


ఆ వ్యక్తి లోపలకి వచ్చి నిలబడ్డాడే తప్ప కనీసం విష్ కూడా చేయలేదు. జగన్నాధం గారికి కొంచెం ఎబ్బెట్టుగానే తోచింది.

'మీరేనా మేథ్స్ అసిస్టెంటు?' అనడిగారు.

'యస్!' అంటూ ట్రాన్స్‌ఫర్ ఆర్డరు టేబుల్‌పై పడేశాడు.

అప్పటికే తమాయించుకుని, 'కూర్చోండి' అన్నారు మర్యాదగా జగన్నాధం గారు.

'నేను కూర్చోడానికి రాలేదు. జాయినయి సెలవు పెట్టిపోవడానికే వచ్చాను. కావాలని కక్షగట్టి



ట్రాన్స్‌ఫర్ చేస్తాడా ఛైర్మన్? నేనిక్కడ పన్జేస్తానని అనుకుంటున్నాడేమో జాయినయి సెలవు పెట్టి పోతాను. ఎల్లకాలం వాడే ఛైర్మన్ అనుకుంటున్నాడేమో! చూస్తా!' అంటూ ఇంకేదో వాగుతున్నాడు.

'సుబ్బారావ్! మేస్టార్ని స్టాఫ్ రూమ్‌కి తీసుకెళ్ళు. జాయినింగ్ రిపోర్టు రాసి పట్రండి. మిగతా విషయాలు తర్వాత మాట్లాడుకుందాం' అంటూ పంపేశారు అతణ్ణి.

★★★

అప్పటికి రెండేళ్ళకు పైగా లెక్కల పోస్టు ఖాళీగా వుంది. జిల్లా పరిషత్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కనపడలేదు. జగన్నాధం గారిది సోషల్ సబ్జెక్టు. లెక్కలు చెప్పలేరు. అక్కడికీ ఆ లెక్కల పీరియడ్లో టెన్త్ క్లాసుకెళ్ళి తెలిసిన లెక్కలు చెప్పేవారు. ఇన్నాళ్ళకు తన మొర ఆలకించి లెక్కల పోస్టు భర్తీ చేశారని సంతోషంతో పొంగిపోయారు. పిల్లల కష్టాలు తీరిపోతాయనుకున్నారు. కాని జరిగిందేమిటి? నాలుగు నెలల క్రితం జరిగిన ఎలక్షన్లో పాత ఛైర్మన్ ఓడిపోవడం, కొత్త ఛైర్మన్ రావడం జరిగింది. వారిద్దరిదీ పచ్చగడ్డి సామెత బంధం. అందుకే ఈ లెక్కల టీచరుకి బదిలీ. ఈయన జాయినయి లెక్కలేం చెప్తారు? అయినా ముందే హెచ్చరిక చేశాడుగా! అయితే మళ్ళీ మామూలేనన్నమాట!

ఆ రోజు సాయంత్రమే ఆ లెక్కల మాస్టారు లాంగ్‌లీవ్ పెట్టేసి వెళ్ళిపోయారు. ఇదంతా కళ్ళల్లో కనపడసాగింది జగన్నాధం గారికి, ఆ పసి వెధవ రాసిన మొదటి వాక్యంతో.

★★★

భోజనం చేసి మధ్యాహ్నం పరీక్షకు బయలుదేరారు మాస్టారు. దారిలవో ఎదురు పడ్డాడు బాలరాజు తండ్రి.

'దండాలు బాబయ్యా! అయిపోయింది. అంతా అయిపోయింది. బుడ్డోడ్ని బూదేవి కప్పగించేశాం. మట్టి పిసుక్కు బతికే వోళ్ళం. ఆ మట్టిలోకే పోతాం. అయినా ఆడు అప్పుడే మట్టిలో కలిసిపోతాడనుకోలేదు' అంటూ బావురుమన్నాడు.

'ఊర్కో గవరయ్యా వూర్కో! ఏం చేస్తాం! వాడి ఆయువు తీరిపోయింది.'

'లేదు బాబయ్యా! ఆయువు తీరిపోలేదు. ఆడ్నినేనే సంపేసా, చేతులారా సంపేశా! అప్పో, సప్పో చేసి ఆ పెవేటు పంతుల దగ్గరికి పంపించుంటే ఆడు బతికేవాడు. డబ్బివ్వందే సదువు సెప్పనన్నాడా పంతులు.

'గవరయ్యా! అయిపోయిందాని గురించి ఆరాలేందుకులే! బాధపడకు. ఇంటికెళ్ళు' అంటూ సాగనంపేసి ముందుకు సాగిపోయారు ఆయన.

స్కూల్లో పన్జేసే మాస్టార్లెవరూ వూళ్ళో కాపురం వుండకపోవటం చేత, డిగ్రీ పాసయిన ఓ యువకుడు ప్రైవేటు చెబుతున్నాడు. గవరయ్య ఎంత బతిమాలినా పైసల్లేందే ప్రైవేటు లేదన్నాడు. అదీ కథ.

★★★

ఆ రాత్రి జగన్నాధం గారికి నిద్రపట్టలేదు. బుర్ర వేడెక్కిపోతోంది. ఆయన మస్తిష్కంలోంచి ఎన్నెన్నో ప్రశ్నలు పుట్టల్లోంచి పాముల్లా బైటికొస్తున్నాయి.

బాలరాజు చావుకి కారణమెవరు?

ఇన్విజిలేటరు రిపోర్టుతో తప్పనిసరి పరిస్థితుల్లో బాలరాజుని డిబార్ చేసిన తానే కారణమా? తనపై పగ తీర్చుకోవడానికి ఆ పసివాడ్ని పావుగా వాడుకొన్న ఆ ఇన్విజిలేటరు కారణమా? రెండు మూడేళ్ళుగా ఖాళీగా వున్న ముఖ్యమైన పోస్టుల్ని కూడా భర్తీ చేయక, ఏమీ పట్టనట్టు వ్యవహరించే యాజమాన్యం కారణమా?

రాజకీయ కక్షలతో టీచర్లను బదిలీ చేసే రాజకీయ నాయకులు కారణమా? అవసరానికి మించిన మాస్టర్లు కొన్ని పాఠశాలల్లో వుంటుంటే, కనీస సంఖ్యలోనన్నా మాస్టర్లు లేని పాఠశాలలకు సర్దుబాటు చేసి విద్యాబోధన కుంటుపడకుండా సక్రమంగా సాగేలా చేయని విద్యాశాఖ కారణమా? ఇన్ని కారణాలకు కారణంగా లెక్కలు రాక కాపీ చేయబోయి పట్టుబడడమే కారణమా?

ఇంత లోపభూయిష్టమైన పరిస్థితులు కళ్ళకు కట్టినట్టు కనపడుతున్నా, వీటిని సరిదిద్ది, విద్యార్జనకు సరైన సౌకర్యాలు కల్పించకపోగా, పదే పదే పరీక్షా విధానంలో ప్రయోగాలు చేస్తూ వుంటే ఆ పసి హృదయాలు తట్టుకోగలవా?

'అవన్నీ మాకు అనవసరం. మా ప్రెస్టేజే మాకు ముఖ్యం' అని పరిపాలనాధికారులు నిర్ణయించుకుంటే, ఇదిగో! ఫలితం ఇలాగే వుంటుంది. అమాయకుల ప్రాణాలు ఆహుతై పోతాయి.

బాలరాజు వంటి చిన్నారులు ఇక ముందైనా బలి కాకుండా వుండాలంటే సక్రమంగా ఆలోచన చేసి, సరైన విద్యా విధానానికి రూపురేఖలు దిద్దుకోవడం మనందరి ధర్మం! కర్తవ్యం!!

అలా జరగని నాడు 'నీ చేతను, నా చేతను' నానుడి విద్యా రంగంలో సార్థకమైపోతుంది.

తస్మాత్ జాగ్రత్త!